

మట్టి గణనాథుడికే జై!

భారీగా మట్టి వినాయకుల తయారీ

పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలని పవన్ పిలుపు

ఇప్పటికే పవన్ నివాసం వద్ద మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు



పిఠాపురం/గొల్లప్రోలురూరల్, సెప్టెంబరు5: మట్టిగణనాథులకు ఆదరణ పెరుగుతోంది. పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలని పర్యావరణవేత్తలతోపాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్వయంగా పిలుపునివ్వడంతో పలువురు మట్టి వినాయకులను ప్రతిష్టించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. గతంతో పోల్చుకుంటే రెండు రెట్లుకు పైగా మట్టి విగ్రహాలకు ఆర్డర్లు పెరిగాయని తయారీదారులు చెబుతున్నారు. పవన్ నివాసం వద్ద ముందుగానే మట్టి గణనాథుడిని నిలిపి పర్యావరణానికి హాని కలిగించని రీతిలో మండపాన్ని ఏర్పాటుచేశారు. పర్యావరణానికి హాని కలిగించని విధంగా పండుగలు జరుపుకోవాలని కొంతకాలంగా పర్యావరణవేత్తలు, సామాజికవేత్తలు ఇస్తున్న పిలుపునకు ఈసారి మంచి స్పందన లభించింది. అదే సమయంలో పిఠాపురం ఎమ్మెల్యేగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యావరణహితంగా పండుగలు జరుపుకోవాలని, దానిని రాష్ట్రంలో పిఠాపురం నియోజకవర్గం నుంచే ప్రారంభించి ఆదర్శంగా నిలుద్దామని పిలుపునిచ్చారు. ఆలయాల్లో ప్లాస్టిక్ కవర్లు, సంచులు వినియోగం వద్దని సూచించారు. పవన్ పిలుపునివ్వడమేగాక తన నివాసం వద్ద వినాయక చవితికి ముందుగానే మట్టి గణనాథుని విగ్రహాన్ని ఏర్పాటుచేయించి స్ఫూర్తిగా నిలిచారు. మండపాన్ని సైతం మట్టి, నారసంచులు వినియోగించి తయారుచేశారు. ఈరోజు నుంచి బట్ట సంచితో బజారుకు వెళ్లదాం అంటూ మండపంపై, చేతి సంచితో బజారు వెళ్లదాం అంటూ వినాయకుడి చేతిలో గుడ్డ సంచిని ఉంచి దానిపై నినాదాలు రాశారు. మండపంపై వరికంకులను ఏర్పాటుచేశారు. మన మట్టి, మన పండుగ, మన పిఠాపురం అని నినాదాలు రాశారు. అందరూ ఈ రీతిలో వినాయక మందిరాలు ఏర్పాటు చేసుకుంటే పర్యావరణానికి హాని కలగని రీతిలో పండుగ జరుపుకోవచ్చునని సూచించేందుకే వీటిని ఏర్పాటు చేసినట్టు జనసేన వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది ముందు నుంచి మట్టి గణనాథుల కోసం డిమాండ్ రావడంతో రాజస్థాన్, పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన తయారీదారులు మట్టితో వినాయక విగ్రహాలు తయారుచేయడం ప్రారంభించారు. గతానికి భిన్నంగా ఈసారి మట్టి వినాయక విగ్రహాలకు ఆర్డర్లు రెండు రెట్లుకు పైగా పెరిగాయి. ఒకటి అడుగు నుంచి పది అడుగుల ఎత్తు వరకూ గణనాథులను వీరు తయారు చేస్తున్నారు. గణనాథులకు ప్రత్యేకతలు జోడిస్తున్నారు. తాటాకు గొడుగు నీడన వినాయకుడు, ఖాదీ వస్త్రాల అలంకరణలో ఉన్న వినాయకుడు, ప్రకృతి వ్యవసాయంతో పండించిన రెండు కిలోల బియ్యం కోటితో తయారు చేసిన గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. ఇటువంటివే మరిన్ని విగ్రహాలు తయారుచేస్తున్నారు. కొందరు తమ మండపాల వద్దే తయారు చేయాలని అడుగుతుండడంతో వీరు అక్కడకు వెళ్లి గణనాథులను తయారు చేస్తున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల పరిధిలోని గ్రామాలు నుంచేగాక జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి మట్టి వినాయకుల తయారీకి ఆర్డర్లు వచ్చినట్టు రాజస్థాన్, పశ్చిమబెంగాల్‌కు చెందిన తయారీదారులు తెలిపారు. కాగా మట్టి గణనాథుల విగ్రహాలు కనిష్ఠంగా రూ.5వేల నుంచి రూ.లక్ష వరకూ ఉన్నాయి. దీంతో ఈసారి మట్టి గణేషుడే ప్రత్యేక ఆకర్షణ.



చేబ్రోలులో పవన్ నివాసం వద్ద ఏర్పాటుచేసిన మట్టి గణేషుడు.. గొల్లప్రోలు బైపాస్ రోడ్డులో తయారైన మట్టి విగ్రహాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనది


- కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్
- ఘనంగా జిల్లా స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమం
- పాల్గొన్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే నానాజీ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 5: ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్తమమైనదని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్టీయూకే అలూమ్నీ ఆడిటోరియంలో గురువారం గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈవో పిల్లి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ముఖ్యఅతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో నాగరికతకు మూలకారణం ఉపాధ్యాయులన్నారు. ఉపాధ్యాయులందరికీ గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ షాన్‌మోహన్ మా ట్లాడుతూ తన తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులేనన్నారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్ని చెడు అలవాట్ల బారిన పడనీయకుండా ఉత్తమమార్గాల వైపు పయనించేలా ఉపాధ్యాయులు తమ బోధనల ద్వారా కృషిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో గౌరవం, మంచి గుర్తింపు వస్తుందన్నారు. తమ దగ్గర ఉన్న జ్ఞానాన్ని పది మంది విద్యార్థులకు పంచాలన్నారు. అతిథులు కాకినాడ జిల్లాలో ఎంపికైన 70 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేసి సత్కరించారు. కాకినాడ రూరల్ మండలం పండూరు పాఠశాల అంగ్ల ఉపాధ్యాయులు ముమ్మిడి వీర వెంకట సత్యనారాయణ, కరప మండలంలోని పాఠశాలకు చెందిన వాకాడ వెంకటరమణలను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో అతిథులు సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారిణి విజయశాంతి, సమాచార పౌరసంబంధాలశాఖ డీడీ డి.నాగార్జున, జేఎన్టీయూకే అధ్యాపకులు, డీవైఈవోలు, ఎంఈవోలు, ఉపాధ్యాయ యూనియన్లు, బంగార్రాజు, రవిరాజు, నూకరాజు, కె.శ్రీనివాసరావు, వెంకట్రావు, మూర్తి, భాగ్యరాజు, సీఎంవో నాగేశ్వరరావు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ఎంవీవీఎస్, వెంకటరమణలను సత్కరిస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో తదితరులు

పంపా గేట్లు.. మొత్తం ముంచేటట్లు!





పంపా రిజర్వాయర్ వద్ద బలహీనంగా ఉన్న వరద గేట్లు.. జిల్లేడుపాడు వద్ద పొర్లుతున్న పంపా జలాలు

- భారీ వర్షాలతో పంపా రిజర్వాయరుకు క్రమేపీ పోటెత్తుతున్న వరద నీరు
- ఏలేరు నిండిపోవడంతో ఆ వరద నీటినీ పంపాకు వదిలేస్తున్న అధికారులు
- దీంతో 98 అడుగుల నీటిమట్టానికి చేరిన పంపా.. క్రమేపీ ఇంకా పెరుగుతున్న ఇన్‌ఫ్లో
- మరో మూడు రోజులు పొంచి ఉన్న భారీ వర్షాలతో వరద మరింత పెరిగే ప్రమాదం
- బలహీనంగా రిజర్వాయర్ గేట్లు.. వరద మరింత వస్తే గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం
- అదే జరిగితే విజయవాడ తరహాలో పూర్తిగా వరద నీటిలో మునగనున్న అన్నవరం
- అటు తుని రూరల్, తొండంగి మండలాలకు ముంపు ముప్పు
- కొత్త గేట్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా అసలు పట్టించుకోని పాలకులు

భారీ వర్షాలకు జిల్లాలో పంపా రిజర్వాయరుకు వరద పోటెత్తుతోంది. క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తోన్న వానలు, అటు ఎగువన ఏలేరు నుంచి వచ్చి పడుతోన్న వరద నీటితో అంతకంతకూ పంపా నిండిపోతోంది. దీంతో రిజర్వాయరు కిందనున్న గ్రామాల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దిగువకు వరద నీరు భారీగా వదిలితే ఇళ్లు, పొలాలు ముంపునకు గురవుతాయని బిక్కుబిక్కుమంటున్నారు. అన్నింటికి మించి పంపా వరద గేట్లు అత్యంత బలహీనంగా ఉండడం అందరినీ బెంబేలెత్తిస్తోంది. గత వైసీపీ సర్కారు వరద గేట్లను కొత్తవి బిగించాల్సి ఉన్నా అసలేం పట్టించుకోలేదు. దీంతో ఇప్పుడు అత్యంత బలహీనంగా ఉన్న గేట్లు పెరుగుతున్న వరదను తట్టుకోలేక కొట్టుకుపోతాయోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే విజయవాడ తరహాలో అన్నవరం గ్రామం పూర్తిగా నీట మునగనుంది. తొండంగి, తుని రూరల్ మండలాల్లో వేలాది ఎకరాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కొన్ని రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. అదే సమయంలో రిజర్వాయర్ల క్యాచ్‌మెంట్ ఏరియాలోను వర్షపాతం అధికంగా నమోదవడంతో వీటిలోకి వరద పెద్దఎత్తున వచ్చి చేరుతోంది. అలాగే రిజర్వాయర్లకు ఎగువన ఏజెన్సీ ప్రాంతాలు, కొండలు, వాగుల నుంచీ నీరు భారీగా వరద వస్తోంది. దీంతో ఇప్పటికే ఏలేరు రిజర్వాయరు దాదాపు నిండిపోయింది. 24.11 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికిగాను 21 టీఎంసీల వరకు నీరు వచ్చేసింది. దీంతో దిగువ ఉన్న పంపా రిజర్వాయరుకు ఏలేరు వరదను వదిలేస్తున్నారు. దీంతో పంపాకు క్రమేపీ వరద పెరుగుతోంది. అదే సమయంలో పంపా క్యాచ్‌మెంట్ ఏరియాలోనూ వర్షాలతో ఇన్‌ఫ్లో ఎక్కువగా వస్తోంది. దీంతో ప్రస్తుతం ఏలేరు నుంచి పంపా రిజర్వాయర్‌కు రోజుకు 70 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతోంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి మరో 150 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో ప్రస్తుత ఇన్‌ఫ్లో 220 క్యూసెక్కుల వరకు కొనసాగుతోంది. ఇదిలాఉంటే పంపా రిజర్వాయరు నీటినిల్వ సామర్థ్యం 105 అడుగులు కాగా ప్రస్తుతం 98 అడుగులకు మించి వరద కొనసాగుతోంది. కానీ 98 అడుగులకు మించి వరద నీటిని నిల్వ చేస్తే రిజర్వాయరుకు ముప్పు నేపథ్యంలో ఎగువ నుంచి వస్తున్న 250 క్యూసెక్కుల నీటిని దిగువకు వచ్చింది వచ్చినట్టు విడిచి పెట్టేస్తున్నారు. అయితే ఏలేరు రిజర్వాయరుకు వరద ముప్పు పొంచి ఉండడం, అటు అల్పపీడనం ప్రభావంతో రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో పంపాకు మరింత వరద భయం వెన్నాడుతోంది. ఇంకా వరద వస్తే దిగువన అనేక ప్రాంతాలు మునిగిపోతాయని ప్రజలు, రైతులు భయపడుతున్నారు.

వణికిస్తోన్న వరద గేట్లు...

పంపా రిజర్వాయరుకు వరద పోటెత్తుతుండడం, అటు రిజర్వాయరు పూర్తిగా నిండిపోవడంతో వరద గేట్లు వణికిస్తున్నాయి. ప్రస్తుతం ఇవి బలహీనంగా ఉండడంతో వరదను ఎంత వరకు ఆపగలవనే ప్రశ్నలు వ్యక్తమయ్యేలా చేస్తున్నాయి. 12వేల ఎకరాలకు సాగునీటిని అందించే ఈ ప్రాజెక్టు 1970లో పూర్తయింది. గరిష్ఠ నీటిమట్టం 105 అడుగులు ఉండేలా తీర్చిదిద్ది సాగునీటి విడుదల కోసం అయిదు వరద గేట్లు, రెండు హెడ్ స్లూయిజ్ గేట్లను అమర్చారు. అయితే అ వరద గేట్లు కొన్నేళ్లుగా మరమ్మతులకు గురయ్యాయి. కానీ గత వైసీపీ సర్కారు ఇదేం పట్టించుకోలేదు. దీంతో నానాటికీ గేట్లు మరింత బలహీనంగా తయారయ్యాయి. వరదనీరు మరింత పెరిగితే మాత్రం ఒత్తిడి అధికమై అయిదే గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. అదే జరిగితే దిగువన ఉన్న అన్నవరం గ్రామం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయి మరో విజయవాడగా మారుతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి అయిదు వరద గేట్లు పూర్తిగా మార్చడానికి గతంలో రూ.3.36 కోట్లతో అంచనాలు రూపొందించారు. కానీ గత జగన్ ప్రభుత్వం వీటిని పక్కనపడేసింది. నాలుగో నంబరు గేటైతే ఎప్పుడు కొట్టుకుపోతుందో తెలియని పరిస్థితి. ఇదిలాఉంటే వరదల సమయంలో గేట్లు ఎత్తి, దించేందుకు కనీసం ప్రాజెక్టుకు జనరేటర్ కూడా లేకపోగా, ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాత్కాలిక మరమ్మతులకు రూ.25 లక్షలు మంజూరు చేయగా, ఆ నిధులతో అత్యంత ప్రమాదకరంగా మారిన 4వ నంబరు గేటుకు వెల్డింగ్, గ్రీజు పూశారు.

తేడా వచ్చిందా ఆ గ్రామాలు అంతే...

తొండంగి/తుని రూరల్, సెప్టెంబరు 9: పంపా నుంచి వరద నీటిని మరింత ఎక్కువగా వదిలితే అన్నవరం గ్రామంతోపాటు తుని రూరల్, తొండంగి మండలాలు తీవ్రంగా ముంపులో చిక్కుకునే ప్రమాదం పొంచి ఉంది. అయితే ప్రాజెక్టు వరద గేట్లు అత్యంత బలహీనంగా ఉండడంతో జరగరానిది జరిగితే మరింత నష్టం జరగనుంది. అదే జరిగితే అన్నవరం మునిగిపోనుంది. అలాగే దిగువకు ఎక్కువ వరద నీరు వదిలితే అన్నవరం శివారులోని కొత్తపేట, ఎస్సీ కాలనీలు తీవ్రంగా ప్రభావం కానున్నాయి. పైగా ఇటీవల కొందరు పంపా వరదనీరు ప్రవహించే ప్రదేశాల్లో అనధికారికంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వేయడంతో ముప్పు మరింత పెరగనుంది. అలాగే దిగువకు వరద నీరు పెరిగితే తొండంగి మండలంలో మూడు వేల ఎకరాల పంట పొలాలు ముంపు బారిన పడనున్నాయి. అలాగే పంపా దిగువనున్న గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, తొండంగి, పి.అగ్రహారం, కృష్ణాపురం, వైడికొండ, వేమవరం తదితర తొమ్మిది గ్రామాల్లో పంట పొలాలు మునిగిపోనున్నాయి. వాస్తవానికి పంపా గేట్లు ఎత్తివేసిన వెంటనే తొలుత పి.అగ్రహారం, ఆ తర్వాత దళిత కాలనీ మునగనుంది. గోపాలపట్నం, కృష్ణాపురం గ్రామాల్లోకి వరద వచ్చేస్తుంది. అలాగే తుని మండలంలో రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. వరద నీరు ప్రవహించే ప్రధాన కాలువ ఆధునికీకరణకు నోచుకోక ముంపు పెరగనుంది. అలాగే వరద జాతీయ రహదారి మీదుగా గవరపేట పొలాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. అక్కడ నుంచి వలసపాకల, తిమ్మాపురం, హంసవరంలో వేలాది ఎకరాలను ముంచేయనుంది. అలాగే జిల్లేడుపాడు వద్ద వంద ఎకరాల్లో ఉన్న టీఎస్ఆర్ చెరువుకు వరద పోటు పెరుగుతంది. తద్వారా జిల్లేడుపాడు, కృష్ణాపురం వరకు తీవ్ర ప్రభావం చూపనుంది. కాగా పంపాకు వరద ముప్పు నేపథ్యంలో ఇప్పటికే గ్రామాల్లో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. పరిస్థితిని అంచనా వేసి, అవసరాన్నిబట్టి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని అధికారులు తెలిపారు.

తునిలో జోరువాన

జలమయమైన రహదారులు

ముంపులో పంటలు

తుని రూరల్, సెప్టెంబరు 5: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. గత ఐదు రోజులుగా ముంపులోనే పంటలు ఉండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గురువారం ఉదయం తెరపిచ్చిన వర్షం మధ్యాహ్నం సమయానికి ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని రెండు గంటలపాటు కుండపోతగా కురిసిన వానకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎర్ర కోనేరు వద్ద కొండల నుంచి దిగివచ్చిన వర్షం నీరు రోడ్లను ముంచెత్తింది. ఎగువ నుంచి వర్షపునీరు కేఎస్ఆర్ ట్యాంక్‌కు పోటెత్తడంతో ఆయకట్టు గేట్లపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతోంది. మరోవైపు దిగువన ఉన్న తుని, తొండంగి మండలాలకు సంబంధించి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో రైతులకు శాపంగా మారిందని, కనీసం చెరువుల్లో తూటి కాడలు తొలగించిన దాఖలాలు కూడా కానరాలేదని రైతులు వాపోతున్నారు.





తునిలో కురుస్తున్న వర్షం.. ఎర్రకోనేరుకు పోటెత్తిన వర్షపు నీరు

జిల్లాలో పంచదార కొరత

కార్డుదారుల చెంతకు చేరని వైనం

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 5: జిల్లాలో పంచదార కొరత కనిపిస్తోంది. ఈనెల నుంచి ప్రభుత్వ చౌక దుకాణాల్లో పంచదార పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈమేరకు కొంత సరుకును రేషన్‌డీలర్లకు పంపించారు. అయితే వినాయక చవితి పండుగ నేపథ్యంలో పంచదార విక్రయాలు వేగంగా జరిగిపోయాయి. దీంతో పంచదార నిల్వలు అయిపోయాయి. రెండు రోజుల నుంచి జిల్లాలో చాలా ప్రభుత్వ చౌకదుకాణాల్లో పంచదార సబ్సిడీపై అందజేయడం లేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తగిన స్థాయిలో పంచదార సరఫరా చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అంటున్నారు. ఈ విషయమై పౌరసరఫరాల శాఖ డీఎం బాలసరస్వతిని వివరణ కోరగా పంచదార నిల్వలు ఉన్నాయని, అవసరమైన రేషన్ షాపులకు పంపిస్తామన్నారు.






కాకినాడ, పిఠాపురంలలో కోర్టుల సముదాయాలను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి గంధం సునీత, పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

కాకినాడ, పిఠాపురంలలో కోర్టు భవనాలను ప్రారంభించిన హైకోర్టు సీజే

కాకినాడ క్రైం/పిఠాపురం, సెప్టెంబరు5: కాకినాడ మూడో అదనపు జిల్లా కోర్టు నూతన భవనాన్ని, పిఠాపురంలో నిర్మించిన జిల్లా కోర్టుల సముదాయాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కాకినాడలో కోర్టు భవన నిర్మాణానికి రూ.6.75 కోట్లతో నిర్మించారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఠాకూర్ వర్చువల్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో పాత భవనాలను తొలగించి, కోర్టు భవనాలు నిర్మాణం చేపట్టడం ద్వారా కక్షిదారులతోపాటు అధికారులకు, సిబ్బందికి ఒత్తిడి లేని విధులు నిర్వర్తించేందుకు దోహదపడుతుందన్నారు. తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పాల్గొని మాట్లాడారు. కాకినాడలో మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముత్తింటి విశ్వేశ్వరరావ్ పాల్గొన్నారు. పిఠాపురంలో కోర్టు భవనాల సముదాయాన్ని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గంధం సునీత ప్రారంభించారు. 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి, సీనియర్ సివిల్ జడ్జి బాబు, ప్రిన్సిపల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు విజయరామేశ్వరి, వెంకట అపర్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు పాల్గొన్నారు.

నిండుకుండలా ఏలేరు జలాశయం



ఏలేశ్వరం, సెప్టెంబరు 5: ఏలేరు ప్రాజెక్టు నుంచి రెండో రోజు 1500 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు. ఆర్డీవో సీతారామారావు, తహశీల్దార్ ఆర్వీ వెంకటేశ్వరరావు ఏలేరు జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సీతారామారావు మాట్లాడుతూ మరో నాలుగు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని.. ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాలతో ప్రాజెక్టులో వరద నీరుచేరడంతో తుని, పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం మండలాలకు వరద ప్రమాదం పొంచి ఉందని, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కాగా ఇప్పటికే పలు మండలాల్లో పంటపొలాలు నీట మునిగాయి. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ఏలేరు ప్రాజెక్టులో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి నిల్వలు పెరిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు జలాశయం పరీవాహక ప్రాంతం నుంచి 5045 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో ప్రాజెక్టులో గురువారం నాటికి 86.56 మీటర్లకుగాను 84.61 మీటర్లు, 24.11 టీఎంసీలకు గా ను 20.25 టీఎంసీలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 300 క్యూసెక్కులు, దిగువ ప్రాంతాలకు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నేడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జడ్పీ సమావేశం - 7లో

65 ఏళ్లుగా మట్టి గణపతే

డఫేదారు నూతి సెంటర్లో ఉత్సవాల ప్రత్యేకత



రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 9: రామచంద్రపురం పట్టణంలోని డఫేదారు నూతి సెంటర్లో గణపతి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉంది. 1960 నుంచీ బాలభక్త సమాజం ఇక్కడ మట్టి గణపతిని మాత్రమే ప్రతిష్ఠించి పూజలు చేస్తోంది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు నీతూకుమారి ప్రసాద్ రాష్ట్ర స్థాయి పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రశంసాపత్రం, రూ.5వేలు నగదు అందజేశారు. 2009లో స్వర్ణోత్సవాలు, 2019లో షష్ఠి పూర్తి మహోత్సవాలు జరిపారు. తాపేశ్వరం సురుచి స్వీట్స్ అధినేత మల్లిబాబు 50 ఏళ్లుగా ఏడాదికి కిలో వంతున పెంచుతూ లడ్డూ అందజేస్తున్నారు. ఈ ఏడాది 65 కిలోల లడ్డూ అందజేయనున్నారు.

2009లో స్వర్ణోత్సవాల అనంతరం గణపతి మాలధారణ చేసిన భక్తులు చవితి ఉత్సవాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 20 మంది భక్తులు గణపతి మాలధారణ చేశారు. అన్నదానం కూడా జరపనున్నారు. భక్తుల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు బాలభక్త సమాజం సభ్యులు చెప్పారు.

నారికేళ ప్రియుడు అయినవిల్లి సిద్ధి వినాయకుడు



అయినవిల్లి, సెప్టెంబరు 5: సకల దేవతా గణాలకు అధిపతి, విఘ్నాలను తొలగించే విఘ్నాధిపతి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి. ఒక్క నారికేళం సమర్పించినంతనే కోరిన కోర్కెలు తీర్చే స్వామి సిద్ధి వినాయకుడు. స్వయంభువుగా వెలసిన గణపతి క్షేత్రాల్లో ప్రత్యేకత గల ఆలయం ఇది. గోదావరి, గౌతమి తీరాన పచ్చని పంట పొలాలు, కొబ్బరి తోటల నడుమ అందాల కోనసీమలో అయినవిల్లి గ్రామంలో కొలువైయున్నాడు ఈ స్వామి. స్వర్ణ గణపతి యజ్ఞం నుంచి ఉద్భవించి దక్షిణాభిముఖుడిగా తూర్పు వైపునకు తొండము తిరిగి, తొండముతో వామహస్తమున మోదకము, దక్షిణ హస్తమున అభయస్త ముద్రతో చూడముచ్చటైన ఉదరముతోభక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. అతి చిన్న ప్రాంగణం, నాలుగు మాడ వీధులు, ప్రాకార మండపం, తూర్పు, దక్షిణ రాజగోపురాలతో చూడచక్కని అందాలతో అలరారుతోందీ క్షేత్రం. దక్ష ప్రజాపతి యజ్ఞ ప్రారంభంలో విఘ్నేశ్వర స్వామి ఆరాధన చేయకుండా శివేశ్వర యాగం ప్రారంభించినందుకు శివుని ఆగ్రహానికి గురై యజ్ఞ భంగం జరిగింది. యజ్ఞభంగం కలగడం మానవాళికి మంచిదికాదని దేవతలు మహావిష్ణువును ప్రార్థించగా దేవతల సూచనల మేరకు దక్ష ప్రజాపతి అయినవిల్లి స్వయంభు గణపతి క్షేత్రానికి విచ్చేసి గణపతి ఆరాధన చేసి తదుపరి యజ్ఞం పూర్తి చేసినట్టు పురాణ ఇతిహాసాలు చెప్తున్నాయి.

ఇసుకతో వినాయకుడు...



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన దొంతంశెట్టి బాల నాగేశ్వరరావు ఇసుకతో చిన్న సైజు వినాయకుడిని చేశాడు. గోదావరిలో సేకరించిన ఇసుకకు తేనె పట్టు, మైనం జత చేసి దారంతో పాటు వెదురుబద్దలను ఉపయోగించి సుమారు ఏడు గంటల పాటు శ్రమించి గణపతిని తయారు చేశాడు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులతో తయారు చేసిన విగ్రహాలు వద్దు... మట్టి విగ్రహాలే ముద్దు అని... అందుకే తాను ఇసుకతో విగ్రహం తయారు చేసినట్టు నాగేశ్వరరావు చెప్పారు.

- మండపేట

చెవిలో చెబితే చాలు కోర్కెలు తీర్చే

బిక్కవోలు వినాయకుడు



బిక్కవోలు, సెప్టెంబరు 5: ప్రాచీన ఆలయాలకు పుట్టినిల్లుగా భాసిల్లే బిక్కవోలులో ఆది దేవునిగా భక్తుల పూజలందుకుంటున్నాడు స్వయంభూ వినాయకుడు. ఈ స్వామి చెవిలో కోర్కెలు చెబితే తప్పక నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పంట పొలాల్లో ఈ వినాయకుని విగ్రహం బయల్పడింది. 9వ దశాబ్దానికి చెందిన ఏకశిల విగ్రహమని పురావస్తు శాఖ పరిశీలనలో వెల్లడైంది. పశ్చిమ చాళుక్యుల తర్వాత బిక్కవోలును రాజధానిగా చేసుకుని 9వ శతాబ్దంలో తూర్పు చాళుక్యులు ఈ ప్రాంతాన్ని పాలించారు. వారు యుద్ధాలకు వెళ్లే ముందు ఈ వినాయకుడికి పూజలు చేసి వెళ్లి విజయం సాధించేవారు. కాలక్రమేణా తురుష్కులు, పిండారీలు, మహ్మదీయుల దండయాత్రల్లో ఈ విగ్రహం భూమిలోకి కూరుకుపోయిందన్న ప్రచారం కూడా వాడుకలో వుంది. అయితే 1960 దశకంలో బిక్కవోలుకు చెందిన ఒక భక్తుని కలలో వినాయకుడు కనిపించి తన ఉనికిని తెలిపాడని ప్రతీతి. నిరుపేద అయిన ఆ భక్తుడు గ్రామస్తుల సహకారంతో ఈ విగ్రహాన్ని బయటకు తీసే ప్రయత్నం చేయగా.... ఎంత తవ్వినా విగ్రహం మొదలు కానరాలేదు. దీంతో అలాగే భక్తులు స్వామిని పూజించడం మొదలుపెట్టారు. ప్రస్తుతం విగ్రహం పది అడుగుల ఎత్తు, ఆరడగుల వెడల్పు వుంది. ఈ స్వామికి తొండం కుడివైపునకు వుండడంతో భక్తుల మనసులోని ఏ కోరికనైనా స్వామికి చెవిలో చెబితే తప్పక నెరవేరుతుందని విశ్వాసం.

చవితి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు: సాయిబాబారెడ్డి



ఈ ఏడాది వినాయకచవితి ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్లు వేశామని, వర్షం వచ్చినా భక్తులు తడవకుండా పందిళ్లపై రేకు షెడ్డు నిర్మించామన్నారు. స్వామి దర్శనానికి బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం రాత్రి 1.59 గంటలకు తీర్థపు బిండె సేవ నిర్వహించి భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. 7వ తేదీ ఉదయం 10.29 గంటలకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి-మహాలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. 16 వరకు ఉత్సవాలను నిర్వహిస్తామని, వచ్చే భక్తులందరికీ అన్నదాన ఏర్పాట్లు చేశామని తెలిపారు. 16న మహాన్నదానంతో ఉత్సవాలు ముగిస్తామని వివరించారు. వినాయకచవితి సందర్భంగా ఆలయంలో ఈ నెల 9నుంచి 16వ తేదీ వరకు ప్రతిరోజూ శ్రీలక్ష్మీ గణపతి స్వామి మూలమంత్ర, జపతర్పణ నిర్వహిస్తామని అర్చకుడు గొల్లపల్లి చలపతిశర్మ చెప్పారు.

నేడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జడ్పీ సమావేశం

స్థాయీ సంఘాల సమావేశాలు కూడా

భారీ వర్షాలు, వరదలే అజెండా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జడ్పీ పాలకవర్గం శుక్రవారం కొలువుదీరనుంది. ఉదయం 10.30 గంటల నుంచి కాకినాడ లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గల జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సాధారణ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నారు. జిల్లాను ముంచెత్తుతున్న భారీ వర్షాలు, వరదలపైనే ప్రధాన అజెండాగా చర్చ జరగనుంది. సమావేశంలో చర్చించేందుకు 41 శాఖలకు చెందిన అంశాలతో అజెండాను రూపొందించారు. ప్రధానంగా ఇరిగేషన్, రోడ్ల మీద గట్టిగా పట్టుబట్టడానికి జడ్పీటీసీలు సన్నద్ధమవుతున్నారు. పాడేరు, కోనసీమ జిల్లాల నుంచి జడ్పీటీసీలు ఎంతో వ్యయప్రయాసలతో సమావేశాలకు వస్తున్నారు. ప్రతి సమావేశంలోనూ వారి పరిధిలోని సమస్యలను ఏకరువు పెడుతున్నారు. నిధుల లేమి, కొందరు అధికారుల అలసత్వం వల్ల ఎటువంటి పనులూ జరగట్లేదని వాపోతున్నారు. స్వపక్షంలోనే విపక్షంగా జడ్పీటీసీలు గళం విప్పిన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నైనా నిధులు విడుదలవుతాయని ఆశిస్తున్నారు. ఒకానొక సందర్భంలో జడ్పీకి రావాల్సిన ఆర్థిక సంఘ నిధులు విడుదల కాక పదవుల్లో ఎందుకు ఉన్నామా అనే అసహనం కూడా జడ్పీటీసీలు వ్యక్తం చేశారు. నిధులు లేక 20 నెలలకు పైగా గౌరవవేతనం చెల్లించలేని పరిస్థితిలో జడ్పీ కొట్టుమిట్టాడుతోంది. వీటన్నిటినీ కూటమి పాలకుల ముందుంచను న్నారు. అజెండాలో పొందుపరిచిన వ్యవసాయం, ఇరిగేషన్, రోడ్లు, గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్, జలవనరులు, మైక్రో ఇరిగేషన్, గృహ నిర్మాణం అంశాలపై ప్రధానంగా చర్చ జరగనుంది.

వరద బాధితులకు భరోసా

రూ.11 లక్షలు విలువైన ఆహార పదార్థాలు అందజేసిన మంత్రి సుభాష్



చిట్టినగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 5: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుబాష్ గురువారం ఉదయం సహాయక చర్యలు చేపట్టారు. రామచంద్రపురం నుంచి బుధవారం రాత్రి రూ.11 లక్షలు విలువ చేసే వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు, ఎనర్జీ డ్రింకులు, టోన్డ్ పాల ప్యాకెట్లు, బేకరీ బన్నులు తీసుకువెళ్లారు. తనకు కేటాయించిన చిట్టినగర్, 33, 47. 64 డివిజన్లలో మంత్రి సుభాష్‌కు పర్యటించి ఆహార పదార్థాలను అందజేశారు. బాధితులను పరామర్శించి భరోసా కల్పించారు. సీఎం రేయింబవళ్లు కష్టపడుతున్నారని, ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పలువురు ఉన్నారు.

వరద బాధితులకు ఒక్కరోజు అమ్మకాల మొత్తం విరాళం

'సురుచి' యజమాని మల్లిబాబు

మండపేట, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సురుచి సంస్థ యజమాని పోలిశెట్టి మల్లికార్జునరావు (మల్లిబాబు) ముందుకొచ్చారు. ఈ నెల 8వ తేదీన ఉభయ గోదావరి జిల్లాల్లో వున్న తమ ఏడు బ్రాంచిల్లో విక్రయాల ద్వారా వచ్చే మొత్తాన్ని సీఎం సహాయ నిధికి అందజేస్తామన్నారు. ఆదివారం వినియోగదారులు తమ సంస్థల్లో అధికంగా స్వీట్లు కొనుగోలు చేసి వరద బాధితుల సహాయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'కృష్ణా బాధితులకు గోదావరి సాయం' పేరుతో ఈ సాయం అందించాలని నిర్ణయించినట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో కేరళలో తుఫాన్ సమయంలో తమ సంస్థ తరపున రూ.6లక్షలు విరాళం అందించామన్నారు. ఇప్పుడు విజయవాడ బాధితులకు బ్రెడ్, జామ్, పచ్చళ్లు అందించామన్నారు.

కిమ్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భారీ చోరీ

» కిలో బంగారం, రెండు కిలోల వెండి ఆభరణాలు అపహరణ » రంగంలోకి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 5: అనుక్షణం జన సంచారం ఉంటుంది. చుట్టూ సీసీ కెమెరాల నిఘా. అవుట్‌గేట్, ఇన్‌గేట్ వద్ద ప్రత్యేక సెక్యూరిటీ సిబ్బంది. అయినప్పటికీ దర్జాగా దొంగలు లోపలికి వచ్చి వేంకటేశ్వరస్వామి ఆభరణాలను అపహరించుకుపోయారు. డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ కామనగరువు పంచాయతీ పరిధిలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. గురువారం ఉదయం ఆలయం వద్దకు వచ్చిన అర్చకుడు వేదాంతం కేశవరామ్ తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించాడు. చోరీ జరిగినట్టు భావించి ఆసుపత్రి యాజమాన్యానికి సమాచారం అందించాడు. కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) నిర్మించారు. స్వామివారికి రూ.20.50 లక్షల విలువైన కిలో బంగారు, రెండు కిలోల వెండి ఆభరణాలను అలంకరించారు. చోరులు చాకచక్యంగా ఆలయ ప్రధాన ద్వారం తాళం తెరిచి దర్జాగా లోనికి వెళ్లి స్వామివారి ఆభరణాలను అపహరించారు. బయట ఉన్న స్వామివారి హుండీని పెకిలించి అక్కడికి సమీపంలోని కొంతదూరం తీసుకువెళ్లి దానిని పగులకొట్టి ఆసొమ్ములను కూడా అపహరించుకుపోయారు. సమాచారం అందుకున్న తాలూకా సీఐ పి.వీరబాబు, తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. అర్చకుడు కేశవరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు.





వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన ద్వారం వద్ద క్లూస్ టీమ్ పరిశీలన... చోరీ జరిగిన విధానాన్ని పరిశీలిస్తున్న తాలూకా సీఐ వీరబాబు



కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

ఉధృతంగా గోదావరి

» ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

» 10.04.528 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

ధవళేశ్వరం, సెప్టెంబరు 5: ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద ప్రవాహంతో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి అంతకంతకూ పెరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం ఉదయానికి నీటిమట్టం 10.60 అడుగుల వరకు చేరుకోగా 8.36 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ధవళేశ్వరంవద్ద వద్ద గంటకు ఒక పాయింట్ చొప్పున పెరుగుతున్న నీటిమట్టం గురువారం రాత్రి పదకొండు గంటలకు 11.9 అడుగులుగా నమోదైంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 10,04,528 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద బుధవారం రాత్రి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ఎగువన ఎస్ఆర్ఎస్‌పీ, కడెం, శ్రీపాద, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి మిగులు నీటిని విడుదల చేయడం వల్ల కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తుండడంతో పాటు తాలిపేరు నుంచి విడుదలైన వరద నీటితో మరలా భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతూ గురువారం సాయంత్రం ఐదు గంటలకు 45.50 అడుగులకు చేరుకుంది. ఆపై తగ్గుతూ రాత్రి 11 గంటలకు 44 అడుగులుగా నమోదైంది.

అయినవిల్లి సిద్ధి వినాయకుని హుండీల ఆదాయం రూ.15.07 లక్షలు



అయినవిల్లి, సెప్టెంబరు 5: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారి కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. 41 రోజులకు ఆలయ ప్రధాన హుండీ ద్వారా రూ.14,60,055, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.47,061... మొత్తం రూ.15,07,116 వచ్చింది. లెక్కింపులో ఈవో ముదునూరి సత్యనారాయణరాజు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా కానిది... రెండు రోజుల్లో

సింగంపల్లిలో వినియోగంలోకి ఆర్వో ప్లాంటు



ఆర్వో ప్లాంటు వద్ద తాగునీరు పట్టుకుంటున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజవొమ్మంగి, సెప్టెంబరు 5: అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలోని సింగంపల్లి గ్రామస్తుల తాగునీటి సమస్యపై 'వరద నీరే... తాగు నీరై' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రెండేళ్లుగా పని చేయని ఆర్వో ప్లాంటుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. తంటికొండ సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు రెండు రోజులు గ్రామంలోనే దగ్గరుండి బాగు చేయించారు. దీంతో గ్రామస్తులు గురువారం సాయంత్రం ఆర్వో ప్లాంటు వద్ద తాగునీటిని పట్టుకున్నారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన 'ఆంధ్రజ్యోతి'కి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు దారుణం

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 5: మండపేట మండలం ద్వారపూడిలో దళితులు, ముస్లింలు కలిసి ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడం చాలా దారుణమని అమలాపురం మాజీ ఎంపీ జీవి హర్షకుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎల్‌బీ శాస్త్రి రోడ్డులోని నివాసంలో పోలీసులు తనను గృహ నిర్బంధం చేయడంపై ఆయన మండిపడ్డారు. అనంతరం హర్షకుమార్ విలేకరులతో మాట్లాడారు. ద్వారపూడిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే దానిని స్పెషల్ పార్టీ పోలీసులు తొలగించడం దారుణమన్నారు. విగ్రహం తొలగింపును వ్యతిరేకించిన మాల, మాదిగలపై లాఠీచార్జి చేయడమేంటని ప్రశ్నించారు. లాఠీచార్జిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు బయల్దేరిన తనను గృహ నిర్బంధం చేయడం తగదన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి నిలబెట్టాలని డిమాండ్ చేశారు.

తండ్రి కళ్లెదుటే ఘోరం

టాటా ఏస్ వ్యాను ఢీకొని రెండేళ్ల బాలుడు మృతి



లాశ్విక్ (పాత చిత్రం)

ఆత్రేయపురం, సెప్టెంబరు 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం తాడిపూడిలో వ్యాను ఢీకొనడంతో రెండేళ్ల చిన్నారి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడిపూడి గ్రామానికి చెందిన ఇర్లపాటి నరేష్ టెంట్‌హౌస్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం అతడి వద్ద పనిచేసే గూడపాటి బాబి సప్లై సామాన్లు తీసుకువెళ్లడానికి టాటా ఏస్ వ్యానుతో వచ్చాడు. అక్కడే ఆడుకుంటున్న నరేష్ కుమారుడు లాశ్విక్ (2)ను వ్యాను ఢీకొనడంతో బలమైన గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. తండ్రి నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నరేష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు లాశ్విక్ కళ్లెదుటే మృతి చెందడంతో ఆ తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు లేడన్న విషయం తెలుసుకుని తల్లి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు అనిల్‌కుమార్

గోకవరం, సెప్టెంబరు 5: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామానికి చెందిన పచ్చిపాల దుర్గాఅనిల్‌కుమార్ (21) పామాయిల్ గెలలు కోసేందుకు గురువారం తంటికొండ వచ్చాడు. తోటలో గెలలు నరికే క్రమంలో అనిల్‌కుమార్ చేతిలో ఉన్న గెడ ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురై నేలపై కుప్పకూలిపోయాడు. సహచర కూలీలు గమనించి అతడిని గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రతిరోజూ చుట్టుపక్కల ఉండే పనులకు వెళ్లేవాడని... మొదటిసారిగా గురువారం తంటికొండ వచ్చి మృత్యువాతపడ్డాడని సహచర కూలీలు ఆసుపత్రి వద్ద విలపించడం స్థానికులను కలిచివేసింది. ఈ ఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైనట్టు సమాచారం.



మోతుగూడెం-చింతూరు రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్టు

మన్యంలో వరుణుడి ప్రతాపం

మోతుగూడెం, సెప్టెంబరు 5: వరుణుడి ప్రతాపానికి మన్యం ఒక్కసారిగా అతలాకుతలమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో బుధవారం రాత్రి నుంచీ భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈ కారణంగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తెల్లవారుజామున నుంచే మోతుగూడెం-చింతూరు మార్గమధ్యంలో రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో వాహనాలు, అంబులెన్స్ రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ ప్రయాణికులు చాలా ఇబ్బందిపడ్డారు. తులసిపాక-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో చెట్లు నేలకొరిగాయి. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్, టీపీఆర్‌వో

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబర్ 5: కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్.మనోహర్ బాధ్యతలు చేపట్టారు. ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కమిషనర్‌గా పనిచేస్తూ కాకినాడ కార్పొరేషన్ డీసీగా బదిలీపై వచ్చారు. టీపీఆర్‌వోగా శైలజ కూడా బాధ్యతలు తీసుకున్నారు. ఆమె గతంలో కాకినాడ కార్పొరేషన్‌లో టీపీఆర్‌వోగా పనిచేసి విశాఖపట్నం గ్రేటర్ కార్పొరేషన్‌కు టీపీఆర్‌ఓగా బదిలీపై వెళ్లి తిరిగి ఇక్కడకు అదే స్థానానికి వచ్చారు.

» జిల్లావ్యాప్తంగా ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గురువులకు సత్కారాలు



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వర్సిటీ వీసీ, అధికారులు

కరప, సెప్టెంబరు 5: మండల పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కరప చంద్రన్న సమావేశ మందిరంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న ఐదుగురు ఉపాధ్యాయులతోపాటు, కాంప్లెక్స్ వారీగా ఎంపికైన ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులు, బెస్ట్ సీఆర్‌పీ, బెస్ట్ స్టాఫ్ కేటగిరీల్లో అవార్డులందుకున్న వారికి ఎమ్మెల్యే నానాజీ జ్ఞాపికలను అందజేశారు. ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ పాల్గొన్నారు. కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. గురజనాపల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5: సమాజానికి ఉత్తమ పౌరులను అందించేది ఉపాధ్యాయులేనని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంపీ కుమార్‌బాబు, ఎంఈవో వి.రాజబాబు తెలిపారు. మండలంలోని ఏలూరు ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం అనపర్తి శ్యామలాకుమారి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందిన సందర్భంగా ఆమెకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో మాట్లాడారు. శ్యామలాకుమారి, కామరాజు దంపతులను వారితోపాటు యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కోడి శ్రీను, దొడ్డిపట్ల రాజబాబు, ఈవోపీఆర్డీ కాశీవిశ్వనాథ్, యూటీఎఫ్ నాయకులు రామలింగేశ్వరరావు, చుక్కల గణేష్, సూర్యావతి, సీఆర్పీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం, సెప్టెంబరు 5: పట్టణంలో ఎంఈవో కార్యాలయంవద్ద ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో బి.అబ్బాయి, ఎంపీటీసీ సభ్యులు కొప్పులబాబ్జీ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన దేశెట్టి రామలక్ష్మిని అభినందించారు.

గండేపల్లిలో..

గండేపల్లి, సెప్టెంబర్ 5: మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాప్రాంగణంలో ఆదిత్య యూనివర్సిటీ, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండు ఫార్మసీ కళాశాలు, బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల, ఫోరెన్సిక్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. అభినయ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శిక్షక్ పర్వ్-2కె24 పేరిట వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాల్గొన్నారు.

గండేపల్లి మండలం తాళ్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీ ఉపాధ్యాయురాలు ఆకెళ్ల శ్రీవాణి ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారాన్ని అందుకున్నారు. ఆమె కలెక్టర్, ఎంపీనుంచి పురస్కారాన్ని అందుకున్నారు.

కాకినాడలో..

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) సామాజిక సంస్థ కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 46మంది ఉత్తమ ఉపాధ్యాయులు, రక్తదాతలను గురువారం సత్కరించారు. రాష్ట్ర సుప్రీం కౌన్సిల్ ఎంపీజే సభ్యుడు హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు ఎంఏ హలీమ్, సిటీ అధ్యక్షుడు ఎండీ గౌస్ మొహిద్దీన్ మాట్లాడారు.

పిఠాపురంలో..

పిఠాపురం, సెప్టెంబరు 5: పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.కేశవరావును అధ్యాపకులు, విద్యార్థినులు సత్కరించారు. భాష్యం స్కూలులో విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్, ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. ఉపాధ్యాయులను సత్కరించి పాదపూజ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో...

గొల్లప్రోలు, సెప్టెంబరు 5: పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక, జడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. మాధురి విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. మాధురి విద్యాలయ చైర్మన్ కడారి తమ్మయ్యనాయుడు, కరస్పాండెంట్ సీతాదేవి, ప్రిన్సిపాల్ మమత పాల్గొన్నారు.

జగ్గంపేటలో..

జగ్గంపేట, సెప్టెంబరు 5: జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టీవీఎస్ రంగారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాచర్ల నాగేంద్రబాబు, క్యాండిల్ యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జుత్తుక నాగేశ్వరరావు, మాదారపు వీరబాబు, జనసేన మండల అధ్యక్షుడు మరిసే రామకృష్ణ పాల్గొన్నారు.

కోటనందూరులో..

కోటనందూరు, సెప్టెంబరు 5: కోటనందూరు మదర్ విద్యాసంస్థలు చైర్మన్ పెనుముచి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. శ్రీసాయి విద్యానికేతన్‌లో బంగారు లక్ష్మి ఆధ్వర్యంలో, ప్రణతి విద్యాసంస్థలో సుర్ల నారాయణమూర్తి, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో శ్రీనివాసరామశేఖర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు, సెప్టెంబరు 5: తాళ్లరేవు ఎంపీపీ సమావేశ మందిరంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గెల్లా విజయలక్ష్మి, సయ్యద్ ఫయాజ్, మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వైదాడి నాగేశ్వరరావు, పి.లక్ష్మిరాధా, సయ్యద్ వహీదున్, టీవీవీ. సత్యనారాయణ, పోతు సూకరత్నాలను ఘనంగా సన్మానించారు. తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 10మంది ఉపాధ్యాయులను సన్మానించారు. పోలేకుర్రు టీడీపీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి, సెప్టెంబరు 5: కొండెవరం వీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉపాధ్యాయుడు గారపాటి శ్రీనివాస్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికకాగా ఆయన్ను కలెక్టర్, ఎంపీ ఘనంగా సత్కరించారు. ఆయన్న ప్రధానోపాధ్యాయులు చక్రపాణి, సర్పంచ్ వేమగిరి చెల్లాయమ్మ, ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు అభినందించారు.

సామర్లకోటలో..

సామర్లకోట, సెప్టెంబరు 5: మండలంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు కె.బలరామ్‌బాబుచౌదరి, అద్దంకి వెంకన్న బాబులను మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో గురువారం ఘనంగా సత్కరించి పూలమాలలతో అభినందించారు. పట్టణ పరిధిలో ఆయా మున్సిపల్ పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఏవీఏ.వజ్రులు, కె.లక్ష్మీపార్వతిలను సామర్లకోట యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథులుగా ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య పి.పుల్లయ్య హాజరయ్యారు. సామర్లకోట అయోధ్యరామ పురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగి న ఈ కార్యక్రమంలో విగ్రహదాతలు వైకుంఠం, కుమారి దంపతుల సౌజన్యంతో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

తునిలో..

తుని రూరల్, సెప్టెంబరు 5: ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ ఉపాధ్యాయులకు ప్రస్తుత విధుల్లో ఉన్న కేవీ రమణ మాస్టారు ఆధ్వర్యంలో తునిలో ఘనంగా సత్కరించారు. సన్మానించిన వారిలో రిటైర్డ్ ఉపాధ్యాయులు జి.అప్పలనాయుడు, ఎ.చల్లారావు, జె.వరలక్ష్మి, కె.సుబ్బారావు, కె.నాగభూషణం, కె.శ్రీరామశర్మ, కేవీ సూర్యనారాయణ, కేవీరమణ, నాగమణి, మూర్తికుమారి, బాపన్న, శ్రీదేవి, సుశీల, విజయభవాని దేవి, పాల్గొన్నారు.

తొండంగిలో..

తొండంగి, సెప్టెంబరు 5: గురుపూజోత్సవాన్ని మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొండంగిలో జరిగిన కార్యక్రమంలో మండలం నుంచి పి.సత్యారావు, త్రినాథ్‌శర్మ, వీవీఎస్ నాయుడు, కల్పనలను సత్కరించారు. ఎంఈవోలు షేక్ బాబ్జి, ఎ.సుబ్బిరెడ్డి పాల్గొన్నారు. మండలంలోని అన్నిపాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అధ్యాపకులు నైతిక విలువలను పాటించాలి: ఇన్‌ఛార్జి వీసీ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 5: అధ్యాపకులు ఎల్లప్పుడూ నైతిక విలువలను పాటిస్తూ సమాజ ఉన్నతికి తోడ్పడాలని ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని యూసీఈకే, జేఎన్టీయూకే అధ్యాపక సంఘాల ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని సెనేట్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ, అధికారులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన కోటేశ్వరరావు, రవీంద్ర, స్వర్ణకుమారి, రాజశేఖర్, చక్రవర్తి, దీక్షితులు, అబ్బయ్య, మూర్తిలకు అవార్డులను అందజేసి వీసీ సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5: ప్రత్తిపాడులోని ఎస్సీ బాలుర, బీసీ బాలికల వసతి గృహాలను ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు గురువారం తనిఖీ చేశారు. తాగునీటి సరఫరాను పరిశీలించారు. ఎస్సీ బాలుర వసతిగృహంలో వాటర్‌ట్యాంక్‌పై కప్పు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

చిన్నకారు ఢీకొని పాడి గేదె మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5: ప్రత్తిపాడు హైవే ఫారెస్ట్ చెక్‌పోస్టువద్ద గురువారం చిన్నకారు ఢీకొని పాడిగేదె మృతి చెందింది. మదినే సుబ్రహ్మణ్యం కుటుంబానికి చెందిన పాడిగేదె రోడ్డు దాటుతుండగా యర్రవరంనుంచికత్తిపూడి వెళ్తున్న చిన్నకారు ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందింది.

డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో జైలు, జరిమానా

కాకినాడ క్రైం, సెప్టెంబరు 5: మద్యంమత్తులో వాహనాలు నడిపిన 11మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు గురువారం తీర్పుచెప్పారు. కాకినాడ ట్రాఫిక్ పోలీసులు బుధవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా 11మంది మద్యం మత్తులో ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని కోర్టులో గురువారం హాజరుపర్చగా నలుగురికి రెండు రోజుల చొప్పున జైలుశిక్ష, ఏడుగురికి ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సామర్లకోట, సెప్టెంబరు 5: సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడో నెంబరు ప్లాట్‌ఫాం శివారున గురువారం తెల్లవారుజామున పట్టాలు దాటుతున్న 45ఏళ్ల వయస్సుగల వ్యక్తిని ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సామర్లకోట రైల్వే ఎస్ఐ లోవరాజు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. నలుపు, నీలం రంగు కలిసిన పొడవు చేతుల చొక్కా, పచ్చరంగు షార్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు చెప్పారు.

రగ్బీ అసోసియేషన్ చైర్మన్‌గా వియ్యపు

పిఠాపురం, సెప్టెంబరు 5: రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్‌గా వియ్యపు రామన్నరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో గురువారం సంఘ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. రామన్నరాజును గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు అభినందించగా, ఒలింపిక్ అసోసియేషన్, సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు కె.పద్మనాభం, చిన్నబ్బాయి, కేతవరపు కృష్ణ, బి.నవీన్, వంశీ, సతీష్, సాయి, పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

కరప, సెప్టెంబరు 5: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాకినాడ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు సూచించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా గురువారం వారు నడకుదురు జనవాహి అనాథాశ్రమంలో వృద్ధులకు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మునిరత్నమ్మ, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ భాస్కరరావు పాల్గొన్నారు.

'డాక్టర్ దేవీ మాధవి సేవలు మరువలేనివి'

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 5: కాకినాడ రంగరాయ వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి సేవలు మరువలేనివని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ వీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. విజయనగరం వైద్యకళాశాలకు ఆమె బదిలీ అయిన నేపథ్యంలో కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలోని ఎస్‌పీఎం గ్యాలరీలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ప్రొఫెసర్ పి.సుజాత, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తాటాకిల్లుకు మంటలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 5: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో విద్యుదాఘాతంతో ఓ తాటాకిల్లుకు మంటలు వ్యాపించాయి. స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేయడంతో భారీ నష్టం తప్పింది. గ్రామానికి చెందిన కర్రి అమ్మాజీకి చెందిన తాటాకుల పాకలో గురువారం విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. పిఠాపురం, ప్రత్తిపాడు ఫైర్‌స్టేషన్‌లకు ఫోన్ చేయగా విజయవాడకు ఫైర్‌ఇంజన్లు తరలివెళ్లినట్లు సమాచారమిచ్చారు. స్థానికులు, జనసైనికులు రంగంలోకి దిగి నీళ్లతో మంటలను అదుపులోకి తెచ్చారు.

యర్రయ్యపేటలో ఇరువర్గాల ఘర్షణ

తొండంగి, సెప్టెంబరు 5: తొండంగి మండలం యర్రయ్యపేటలో గురువారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఊరుమ్మడి సొమ్ము రూ.33లక్షల విషయమై ఇరువర్గాలమధ్య వాగ్వాదం జరగ్గా సూరాడ మసేను అనే వ్యక్తితోపాటు పలువురు ప్రశ్నించగా మరోవర్గంవారు దాడికి పాల్పడగాపలువురికి గాయాలయ్యాయి. మసేను ఫిర్యాదుమేరకు ఏడుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

పిఠాపురంలో 'బీన్యూ' షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5: 'బీన్యూ మొబైల్స్, ఎలక్ట్రానిక్స్' షోరూంను పిఠాపురంలోని మంగాయమ్మరావుపేట మెయిన్‌రోడ్‌లో గురువారం ప్రారంభించినట్లు సంస్థ సీఈవో యర్రగుంట్ల సాయి నిఖిలేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురంలో ఇది రెండో షోరూం అని, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విన్నూత మోడళ్లను ఆకర్షణీయమైన ఆఫర్లతో ఆన్‌లైన్ ధరల కంటే తక్కువకు అన్నివర్గాల వారికి అందుబాటులో ఉండేలా అందిస్తున్నామని అన్నారు. అధునాతమైన స్మార్ట్ ఫోన్లు సామ్‌సంగ్, ఐఫోన్, రెడ్మీ, రియల్‌మి, వివో, ఒప్పో సిరీస్, ఇంకా అనేక బ్రాండ్‌ల మొబైల్ ఫోన్లు అతి తక్కువ ధరలకే అందిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ బ్రాండ్ల ల్యాప్‌టాప్‌లు విక్రయిస్తున్నామన్నారు. వినియోగదారుల సౌలభ్యంకోసం ఫైనాన్స్ సౌకర్యం, ఎంపిక చేసిన మోడల్స్‌పై సున్నా డౌన్ పేమెంట్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు.

'మట్టి ప్రతిమలే శ్రేయస్కరం'


ఏలేశ్వరంలో మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రామలింగేశ్వరరావు

ఏలేశ్వరం, సెప్టెంబరు 5: మట్టి ప్రతిమలే శ్రేయస్కరమని ఏలేశ్వరం ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు అన్నారు. మార్స్ కంప్యూటర్స్ నిర్వాహకులు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో 1000 మట్టి గణపతి విగ్రహాలు గురువారం పంపిణీ చేశారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎస్ఐ రామలింగేశ్వరరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రగడ ప్రయాగ మూర్తి పాల్గొన్నారు. దాడిశెట్టి వీరబాబు, కోరాడ రాజు, మనోహర్, సత్య, యామిని ప్రియ పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్ ఆధ్వర్యంలో..

తుని రూరల్, సెప్టెంబరు 5: మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్నిపరిరక్షిందామని అవగాహన కల్పిస్తూ మట్టి గణపతి విగ్రహాలను శ్రీ ప్రకాష్ విద్యార్థులు పంపిణీ చేపడుతున్నారు. ఇందులో భాగంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడుకు మట్టి గణపతిని అందజేశారు. టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి), మోతుకూరి వెంకటేష్ పాల్గొన్నారు.

'మన భూమిని రక్షించుకుందాం'

కాకినాడ రూరల్, సెప్టెంబరు 5: మన భూమిని రక్షించుకుందామంటూ కాకినాడ జగన్నాథపురం దుర్గాప్రసాద్ స్కూల్ విద్యార్థులు వినూత్నంగా కార్యక్రమం చేపట్టారు. జగన్నాథపురం నుంచి ఘాటీసెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్, కరస్పాండెంట్ భానుప్రియాంక ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తూ 500 మట్టి వినాయక ప్రతిమలను వాహనదారులకు, స్థానికులకు అందజేశారు.

పిఠాపురంలో విద్యార్థుల ర్యాలీ

పిఠాపురం, సెప్టెంబరు 5: మట్టి గణనాథులనే పూజిద్దాం అంటూ పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. మట్టి వినాయకుడిని పూజిద్దాం-పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. పట్టణ వీధుల్లో ర్యాలీ సాగింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషశ్రీ, ఆనంద్, కామేశ్వరరావు, కృష్ణప్రసాద్, అనంతలక్ష్మి, అలీబాబా, పద్మావతి, వీరబాబు పాల్గొన్నారు.


తునిలో యనమలకు మట్టి గణపతిని అందజేస్తున్న శ్రీ ప్రకాష్ విద్యార్థులు

ఆదిత్య ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

గండేపల్లి, సెప్టెంబర్ 5: సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నేషనల్ సర్వీస్ స్కీం ఆధ్వర్యంలో ఆనూరులో మట్టి గణేష్ ప్రతిమలు పంపిణీ చేశారు. కళాశాల డీన్ కెరీర్ గైడెన్స్ డాక్టర్ డి.కిషోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎం.రఘునాథ్, చిట్టూరి రాంప్రసాద్ పాల్గొన్నారు

పిఠాపురం, సెప్టెంబరు 5: వినాయక చవితిని సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని బాలగంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవకమిటీ, విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు కోరారు. పట్టణంలోని గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ప్రతినిధులు వెంకటేశ్వరరావు, సురేంద్ర దత్తులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై ఆర్డీవో సమీక్ష

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5: రెవెన్యూ డివిజన్ పరిధిలో చవితి ఉత్సవాలు, గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, భద్రతపరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆర్డీవో కిషోర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాకినాడలోని ఆయన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. జగన్నాథపురంవద్ద, రూరల్ సూర్యారావుపేటవద్ద నిమజ్జన ఉత్సవాలు జరుగుతున్నందున అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు మాట్లాడుతూ నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. సమావేశంలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ డీఈ మాధవి, నగర గణేష్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, దువ్వూరి సుబ్రహ్మణ్యం, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు మాలకొండయ్య పాల్గొన్నారు.

శ్రీపాదవల్లభునికి లక్ష తులసి అర్చన

పిఠాపురం, సెప్టెంబరు 5: శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితులు, రుత్విక్కులు తులసి దళాలతో అర్చన చేశారు. మహాసంస్థానం ఈవో సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా జైగణేష్ మాలాధారణ

పిఠాపురం, సెప్టెంబరు 5: పిఠాపురం పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లోని జైగణేష్ దేవస్థానంలో గురువారం గణపతి మాలధారణ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి 500మందికిపైగా భక్తులు మాల ధరించారు. ఆలయ అర్చకులు మైలవరపు రామకృష్ణ, అవినాష్ వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు జరగ్గా ఈవో శ్రీరాములు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 5: పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ గురువారం తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రాత్రిపూట గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్ ఉన్నారు.

'మొక్కలునాటి ప్రజారోగ్యం కాపాడండి'

తాళ్లరేవు, సెప్టెంబరు 5: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కృషిచేయాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. వనం-మనంలో భాగంగా తాళ్లరేవు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. టీడీపీ నేతలు మందాల గంగసూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, గంజా సూరిబాబు, నడింపల్లి వినోద్ పాల్గొన్నారు.

వరద బాధితులకు స్నాక్స్ తరలింపు


వాహనాలను ప్రారంభిస్తున్న జ్యోతుల నవీన్

గండేపల్లి, సెప్టెంబర్ 5: వరద బాధితులకు గండేపల్లిలోని తెలుగుయువత, పలువురు నాయకుల ఆర్థికసాయంతో మంచినీరు బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, స్నాక్స్‌ను రెండు వ్యాన్లపై గురువారం టీడీపీ కార్యాలయం నుంచి విజయవాడ తరలించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోతుల మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, వెలమాటి కాశీ, బొల్లంరెడ్డి రామకృష్ణ, వెంపాటి సతీష్, పసుమర్తి సుబ్రహ్మణ్యం, వెంపాటి రాజు, ఇప్పిర్ల బాబి పాల్గొన్నారు.

విజయవాడకు నిత్యావసర సరుకుల కిట్లు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులకు ఎన్ఆర్ఐ జనసేన అమెరికా టీమ్ సభ్యులు వెయ్యి నిత్యావసర సరుకుల కిట్లను సమకూర్చారు. 8కిలోల బియ్యం, కిలో వంతున ఆయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, కారం, ఉప్పు, చింతపండు సహా ఇతర నిత్యావసర వస్తువులు, కాయగూరలను ఒక కిట్టుగా తయారు చేశారు. వీటిని గురువారం సాయంత్రం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంనుంచి విజయవాడ పంపారు. సరుకులను సమకూర్చిన వారిలో ఎన్ఆర్ఐ టీమ్ సభ్యులు స్వామి అనిశెట్టి, అనిల్ అనుసూరి, ఇందుగుల సప్తగిరీష్, కొత్త మాన్ సాయిరాజ్, నందూరి సాయి, ఆంధ్ర టీమ్ సభ్యులు చిక్కాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, దొరబాబు, ఓదూరి కిషోర్ ఉన్నారు.

ముంపు బాధితులకు కాకినాడ నుంచి మందులు

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 5: విజయవాడ ముంపు బాధితుల కోసం కాకినాడ సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్(సీడీఎస్)నుంచి మందుల కిట్లను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ రత్నరాజు ఆధ్వర్యంలో సీనియర్ ఫార్మసిస్ట్ పద్మ మీనాక్షి బృందం 10వేల మందుల కిట్లను సిద్ధం చేశారు. వరద తగ్గుముఖం పట్టే సమయంలో ముంపు ప్రాంతాల్లో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వివిధ రకాల మందులను కిట్లుగా తయారు చేసి సిద్ధం చేశారు. వీటిని ప్రత్యేక వాహనంలో విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజ్‌లో ఉన్న రీజనల్ డ్రగ్‌స్టోర్‌కు పంపేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అన్నవరం దేవస్థానం ఉద్యోగుల విరాళం రూ.3.80 లక్షలు

అన్నవరం, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితుల సహాయార్థం అన్నవరం దేవస్థానం ఉద్యోగులు ముందుకొచ్చారు. తమ ఒక్కరోజు మూల వేతనం రూ.3.80లక్షలు వరద బాధితులకు విరాళంగా అందించాలని అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం దేవదాయ కమిషనర్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. రెగ్యులర్ ఉద్యోగులనుంచే ఈ విరాళం అందుతుందని కాంట్రాక్ట్ బేసిక్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వీటిలో లేరని ఉద్యోగులు తెలిపారు.

స్ఫూర్తి ఫౌండేషన్ వరద బాధితులకు సేవలు

తుని రూరల్, సెప్టెంబరు 5: తునికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు 2000 ఆహారపొట్లాలు, 1500 బిస్కెట్ ప్యాకెట్లు, పాలు, పండ్లు, వాటర్ పంపిణీ పంపించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేమాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సుద్దగడ్డ వరదతో కుళ్లిన వరిపంట

గొల్లప్రోలు, సెప్టెంబరు 5: అకాల వర్షాలు, సుద్దగడ్డ వరదలు రైతులకు తేరుకోలేని నష్టాలు కలిగించాయి. పెట్టిన పెట్టుబడులు కోల్పోయారు. సుద్దగడ్డతోపాటు చౌటు కాలువకు వచ్చిన వరదలు, పుష్కర కాలువకు పలుచోట్ల పడిన గండ్లతో గొల్లప్రోలు పట్టణంతోపాటు తాటిపర్తి, చెందుర్తి, చిన జగ్గంపేట, వన్నెపూడి, చెందుర్తి, మల్లవరం, లక్ష్మీపురం, సీతానగరంల్లోని 2వేల ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి, కాయగూరలు తదితర పంటలు ముంపునకు గురయ్యాయి. ఐదురోజులకు పైగా వరద నీటిలో ఉండిపోవడంతో గొల్లప్రోలు పరిసర ప్రాంతాల్లోని వరిపంట కుళ్లిపోయింది. పంట పనికి రాదని, మళ్లీ వేసుకుందామన్నా నాట్లు సమయం దాటిపోయిందని రైతులు తెలిపారు. పిఠాపురం మండలంలో 900 ఎకరాల్లో వరి తదితర పంటలకు నష్టం వాటిల్లింది.

అన్నదాతను నిలువునా ముంచిన వర్షాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5: వర్షాలవల్ల మండలంలో అన్నదాతలు కుదేలయ్యారు. 40 రోజుల క్రితం మండలంలో వరినాట్లు సాగు చేపట్టిన పంట పొలాలు వరదల కారణంగా ముంపునకు గురై కుళ్లిపోవడంతో అన్నదాతలు నిలువునా నష్టాల్లో కూరుకుపోయారు. మండలంలోని సుద్దగడ్డ వాగు, వెంకన్నదొర చెరువు, ఒమ్మంగిలోనిరాజు చెరువులు పొంగి ప్రవహించడంవల్ల ఖరీఫ్ పంట పొలాలు రోజుల తరబడి ముంపునీటిలో నిల్వ ఉండిపోవడం వల్ల కుళ్లిపోయాయి. పెదశంకర్లపూడిలో ఎర్రకాలువ ఉధృతికి వరి పొలాలు ఇసుక మేటలు వేయడంతో కోలుకోని నష్టం జరిగింది.

వర్షం ముంపులో నీలపల్లి రహదారులు

తాళ్లరేవు, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన భారీవర్షాల నీరు బయటకు వెళ్లే మార్గంలేక నీలపల్లి పంచాయతీ రామచంద్రకాలనీ ముంపుతో రహదారులు జలమయమయ్యాయి. ఇళ్ల యజమానులు డ్రైనేజీ, రోడ్డు స్థలాలను ఆక్రమణలు చేసి కట్టడాలు చేయడం వల్ల వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎంపీటీసీ దంగేటి సూరిబాబు ఆధ్వర్యంలో వర్షపునీరు బయటకు వెళ్లే మార్గాన్ని సిబ్బంది చేపట్టారు. నీలపల్లి నుంచి అయ్యన్ననగర్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను బయటకు తీశారు.

కొండ చెరువు ఆక్రమణలపై రెవెన్యూ సర్వే

సామర్లకోట, సెప్టెంబరు 5: పట్టణ ఏడీబీ రోడ్డు సమీపానగల కొండ చెరువు ఆక్రమణలకు గురికాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో గురువారం అధికారుల బృందం సర్వే నిర్వహించింది. గతనెల 16న చెరువు స్థలాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టితో కప్పి ఆక్రమణలకు పాల్పడుతున్న వైనంపై సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి అందిన ఫిర్యాదు మేరకు సత్వరం స్పందించి ఆక్రమణ చర్యలను నిలిపివేయించారు. ఆక్రమణదారుడివద్ద ఏమైనా ధృవపత్రాలు ఉంటే చూపాలని ఆదేశించినా అతడు పత్తాలేకుండా పోవడంతో ఇరిగేషన్ అధికారులు గంగరాజు, ఏఈ వీరబాబు, నాగు, వీఆర్వోలు, మండల సర్వేయర్ సుబ్బారావులతో చెరువు స్థలాన్ని సర్వే చేయించారు. చెరువులో చేపలు పట్టుకునే లీజు హక్కు పొందినవారిని, సరిహద్దు రైతులను హాజరుపర్చి సర్వే చేయించారు. రెండెకరాల మేర చెరువు గర్భాన్ని ఆక్రమించుకునే చర్యలను అడ్డుకున్నట్లు తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. సదరు కొండ చెరువు వాస్తవ విస్తీర్ణాన్ని 12.41 ఎకరాల మేర చెరువు గర్భాన్ని కొలతల మేరకు ఇరిగేషన్ అధికారులకు అప్పగించారు.